క్లుప్తంగా

గంగమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారికి హారతి

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండల కేంద్రంలో గంగజాతర సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, శక్తిపూజ, మంగళ హారతి సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

రొంపిచెర్ల మండలంలో 144 సెక్షన్



సూచనలిస్తున్న ఎస్‌ఐ సుకుమార్

రొంపిచెర్ల: మండలంలో 144 సెక్షన్ అమలులో ఉందని పాటించాలని, నిషేధ ఆజ్ఞలు ఎవరు అతిక్రమించిన చర్యలు తప్పవని ఎస్‌ఐ సు కుమార్ హెచ్చరించారు. అయన బుధవారం మాట్లాడుతూ ఎన్నికలు పూర్తి అయినా కొన్ని గ్రామాల్లో అక్కడక్కడ ఘర్షణలు జరుగుతు న్నాయని తెలిపారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని మండలంలో 144 సెక్షన్ అమలు చేయాలని తహశీల్దార్ మోహీద్దీన్ అదేశాలు జారీ చేశారని చెప్పారు. గ్రామాల్లో గుంపులు గుంపులుగా జనాలు ఉండ కూడదన్నారు. ఇద్దరు ముగ్గురుపైన ఎక్కడ ఉన్నా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జూన్ 5వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుంద న్నారు. ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించారు.

ప్రమాదాలకు నిలయంగా స్పీడ్ బ్రేకర్లు



బలిజవీధిలో స్పీడ్ బ్రేకర్లు

రొంపిచెర్ల: పంచాయతీలోని బలిజవీధి, పాళ్యెం వీధుల్లో స్పీడ్ బ్రేకర్లతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ వీధుల్లో అవసరం లేకున్నా 50 మీటర్ల దూరం లోపు మూడు స్పీడ్ బ్రేకర్లును వేశారు. అవి కూడా ఎక్కువ ఎత్తు వేయడంతో నిత్యం ద్విచక్ర వాహనదారులు ప్రమాదవశాత్తు కిందపడి గాయపడుతున్నారు. రెండు వీధుల్లో ఇదే పరిస్థితి ఉండడంతో ద్విచక్ర వాహనాల్లో వెళ్లే మహిళలు అవస్థలు పడుతున్నారు. అధికారులు తగు చర్యలు తీసుకుని స్పీడ్ బ్రేకర్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

లయన్స్‌క్లబ్ అన్నదానం



వి.కోట : వి.కోట గ్రేటర్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రైవేట్ బస్టాండ్ వద్ద దాదాపు 800 మందికి అన్నదానం చేశారు. క్లబ్ అధ్యక్షుడు లోకేష్, సభ్యులు సురేంద్రగౌడ, తుకారాం, మంజునాథ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం



శిక్షణకు హాజరైన పిల్లలు

పలమనేరు: విలువలు లేని విద్యతో మంచి కంటే చెడే ఎక్కువగా జరిగే అవకాశం ఉంటుందని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు తెలిపారు. స్థానిక కళామందిరంలో బుధవారం నైతిక విలువలపై విద్యార్థులకు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు నీతి కథలు, నీతి పద్యాలను నేర్పడం ద్వారా వారిలో నైతిక విలువలు పెరుగుతాయన్నారు. వేసవి సెలవులను సక్రమంగా వినియోగించుకుని, భవిష్యత్ మంచిగా మలుచుకునేలా తల్లిదండ్రులు పిల్లలను శిక్షణకు పంపాలని తులసీనాథం నాయుడు కోరారు. సంస్థ కార్యదర్శి పుష్ప పాల్గొన్నారు.


23న కంచి గరుడసేవ

నగరి: స్థానిక కరియా మాణిక్యస్వామి ఆలయంలో ఈనెల 23వ తేదీ గురువారం కంచి గరుడసేవ నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి రమణ తెలిపారు. బుధవారం ఆయన గరుడసేవ వివరాలను వెల్లడించారు.

ఆ వంద కేంద్రాలే కీలకం



స్వగ్రామాలకు ఓటు వేసేందుకు వచ్చి ఊర్లకు వెళుతున్న జనం



పలమనేరు నియోజకవర్గ మ్యాప్

పలమనేరు నియోజకవర్గంలో 2024 సాధారణ ఎన్నికల్లో అత్యధికంగా 87.9 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో ఈ సారి 90శాతం కంటే ఎక్కువ పోలింగ్ నమోదైన బూత్‌లు 118 ఉండడం విశేషం. కేంద్రాల వారీగా..ఆరు బూత్‌లలో 1300 నుంచి 1400 మంది దాకా ఓటర్లున్నారు. నియోజకవర్గంలోనే పత్రపల్లె కేంద్రం 1403 ఓట్ల నమోదులో టాప్‌లో ఉంది. 1249 ఓట్ల నమోదుతో దేవదొడ్డి టాప్‌లో ఉంది. పెద్దపంజాణి మండలంలోని పెనుగొలకలలో కేవలం 418 ఓటర్లుండగా.. ఇక్కడ 395 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. అభ్యర్థుల గెలుపులో వెయ్యికి పైగా ఓట్లు నమోదైన వంద బూత్‌లు కీలకం కానున్నాయి.

నియోజకవర్గంలో మొత్తం ఓట్లు	: 2,67,896
పోలైన ఓట్లు	: 2,35,476
పోలింగ్	: 87.9శాతం
మొత్తం బూత్‌లు	: 287

- 90 శాతం పోలింగ్ దాటిన కేంద్రాలు వందకు పైగా
- ఆరు బూత్‌ల్లో 1,300 నుంచి 1,400 దాకా ఓటర్లు
- వెయ్యి ఓట్ల కంటే ఎక్కువ పోలింగ్ జరిగిన కేంద్రాలు 108

పలమనేరు: నియోజకవర్గంలో 90 శాతానికి పైగా పోలింగ్ నమోదు అయిన వెయ్యికి పైగా పోలింగ్ బూత్‌లు ఈసారి గెలుపోటములను నిర్దేశించనున్నాయి. కత్తార్లపల్లి, బట్టందొడ్డి, శ్రీరామాపురం, తుర్లపల్లి, గొదమాకులపల్లె, ముత్తుకూరు, పెద్ద వెలగటూరు, పెద్దపంజాణి, కమ్మపాళెం, మాడి, శివాడి, బొమ్మరాజుపల్లి, అమ్మరాజుపల్లె, కోగిలేరు, బందార్లపల్లె, గుండుగల్లు, పశపత్తూరు, గంగ్రాజు పల్లె, పత్తికొండ, మామడుగు, మేలుమాయి, గంగవరం, కొత్తపల్లె, కీలపల్లె, కీలపట్ల, బేలుపల్లె, బెల్లంమొడుగు, లక్కనపల్లి, గడ్డూరు, ఎం.కొత్తూరు, దేవదొడ్డి, బైరెడ్డిపల్లె, పాతపేట, పాతూరునత్తం, పత్రపల్లి, తోటకనుమ, కొంగాటం, ముదరందొడ్డి, పలమనేరు ఇందిరమ్మ కాలనీతో తదితర వంద పోలింగ్ బూత్‌ల పరిధిలో 1000 నుంచి 1400 దాకా ఓటర్లున్నారు. ఇక్కడ పోలింగ్ శాతం సైతం భారీగా నమోదైంది.

కర్ణాటక నుంచి భారీగా ..

పలమనేరు నియోజకవర్గానికి చెందిన వేలాదిమంది పొరుగునే ఉన్న కర్ణాటకలో ఉపాధి, ఉద్యోగాలు, పిల్లల చదువుల కోసం ఉంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ దఫా సుమారు ఐదువేల మంది వరకు ఓటర్లు స్వగ్రామాలకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించు కోవడం పోలింగ్ శాతం పెరిగేందుకు కారణమైంది.

అభివృద్ధికే ఓటు..

నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో 85.79శాతం పోలింగ్ నమోదు కాగా, ఈ దఫా 87.9 శాతానికి పెరిగింది. గ్రామాల్లో మారిన బడులు, వైద్యం, రైతులకు ఆర్‌బీకేలు, ఇంటి ముంగిటే సచివాలయ సేవలు అభివృద్ధి చెందిన గ్రామాలను చూసి మెజారిటీ ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నట్లు సమాచారం. రెండ్రోజులుగా పలమనేరు నుంచి బెంగళూరు వైపు వెళ్లే బస్సులు ఇక్కడ ఓటేసేందుకు వచ్చిన వారితో తీవ్రమైన రద్దీగా మారాయి.

భారీ పోలింగ్‌తో గెలుపుపై ధీమా



నాయకులతో ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: సార్వత్రిక ఎన్నికల్లో అధిక శాతం పోలింగ్ నమోదు వైఎస్సార్‌సీపీ అధిక మెజారిటీతో గెలుపొందేందుకు నిదర్శనమని వైఎస్సార్‌సీపీ పలమనేరు ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ అన్నారు. బుధవారం మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులతో ఆత్మీయంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణాల్లోకంటే గ్రామీణ ప్రాంతాల్లో అధిక శాతం పోలింగ్ అయిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అందించిన సంక్షేమ పథకాలను చూసి గ్రామీణులు జగనన్నను గెలుపించుకోవాలన్న లక్ష్యంతో ఎన్నడూ లేని విధంగా పోలింగ్ కేంద్రాలకు పోటెత్తినట్లు తెలుస్తోందని చెప్పారు. మండలంలో తన గెలుపుపే ధ్యేయంగా ప్రచారానికి, పోలింగ్‌కు ఎంతో కృషి చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు వెంకటేగౌడ కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి కోనేటి రాయస్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన కోనేటిరాయస్వామివారి ఆలయం

- ఉదయం ధ్వజారోహణం, రాత్రి శేష వాహన సేవ
- టీటీడీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు
- ఎన్నికల కోడ్ నిబంధనల మేరకు ఉత్సవాలు

గంగవరం: మండలంలోని కీలపట్లలో టీటీడీ అనుబంధ ప్రసిద్ధ శ్రీకోనేటిరాయస్వామివారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఎలాంటి హంగు ఆర్భాటాలు లేకుండా, ప్రసార మాధ్యమాలకు దూరంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రకటించింది. బుధవారం సాయంత్రం వేద మంత్రోచ్చారణల నడుమ అంకురార్పణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. గురువారం ఉదయం 11 గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం పెద్ద శేష వాహనంలో శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీస్వామి వారు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహిస్తారు.17వ తేదీ ఉదయం 10 గంటలకు చిన్న శేష వాహనం, రాత్రి 7గంటలకు హంస వాహనం, 18వ తేదీ ఉదయం 10 గంటలకు సింహ వాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహనం, 19వ తేదీ ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనం, 20వ తేదీ ఉదయం మోహినీ ఉత్సవం, సాయంత్రం 4 గంటలకు కల్యాణోత్సవం, రాత్రి గరుడసేవ ఉంటుంది. 21వ తేదీ ఉదయం హనుమంత వాహనం, మధ్యాహ్నం వసంతోత్సవం, రాత్రి గజ వాహనం, 22వ తేదీ ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం ఊంజల్‌సేవ, రాత్రి చంద్రప్రభ వాహనం, 23వ తేదీ ఉదయం రథోత్సవం, సాయంత్రం ఊంజల్‌సేవ, రాత్రి అశ్వ వాహనం, 24వ తేదీ ఉదయం తిరుచ్చి ఉత్సవం, చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణం, పూర్ణాహుతి, 25వ తేదీ చివరి రోజు పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయి. 20వ తేదీ కల్యాణోత్సవంలో పాల్గొనే భక్తులు నిర్ణయించిన రుసుం చెల్లించి సంప్రదాయ దుస్తులతో దంపతులిద్దరు పాల్గొనవచ్చని ఆలయ టీటీడీ అధికారులు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలి



టోర్నమెంట్ ప్రారంభ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కృష్ణరావు

గుడుపల్లె: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని పీఈఎస్ కళాశాల ప్రిన్సిపాల్ హెచ్ఆర్ కృష్ణరావు తెలిపారు. బుధవారం పీఈఎస్ కళాశాలలో వార్షిక వాలీబాల్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 24వ తేదీ వరకు జరిగే ఈ టోర్నమెంట్‌లో 8 టీమ్‌లు పాల్గొననున్నాయని తెలిపారు. క్రీడా పోటీలతో స్నేహ సంబంధాలు ఏర్పాడుతాయని, మానసికోల్లాసంతో ఒత్తిడిని జయించవచ్చన్నారు. వైద్య విద్యార్థులు, సిబ్బంది, అధ్యాపకులు టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని కోరారు. వైద్యులు శశిభూషణ్, కల్యాణ్, ఆదిత్య పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి

పుంగనూరు: ప్రభుత్వాస్పత్రుల్లో అందుతున్న సేవలను గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని డీపీఓ డాక్టర్ హర్షవర్ధన్ సూచించారు. బుధవారం సింగిరిగుంట, తూర్పుమొగశాల, ముడిపాపనపల్లె హెల్త్ సెంటర్లను తనిఖీ చేశారు. కిషోర బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత ఉన్న వారికి ఐరన్ మాత్రలను పంపిణీ చేశారు. నెల నెల అందిస్తున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఏఎన్ఎంలు వ్యాక్సినేషన్ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఎన్‌హెచ్ఎం రెహమాన్, వైద్యాధికారులు జార్జ్, సృజన తదితరులు పాల్గొన్నారు.


మాతా శిశు మరణాలను కట్టడి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్(కాణిపాకం): మాతా శిశు మరణాలను కట్టడి చేయాలని డీఎంహెచ్ఓ ప్రభావతిదేవి అన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో బుధవారం మాతా శిశుమరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మాతృ మరణాలు జరగకుండా నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. సకాలంలో వైద్య పరీక్షలు చేసి సుఖ ప్రసవం జరిగేలా చూడాలని చెప్పారు. హైరిస్క్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో డీఐఓ రవిరాజు, వైద్యాధికారులు ఉషశ్రీ, లత, మాలతి, జానకీరావు, శిరీష తదితరులు పాల్గొన్నారు.

యాళి వాహనంపై మృత్యుంజయేశ్వరుడు



యాళివాహనంపై స్వామివారి ఊరేగింపు

చౌడేపల్లె : మండల కేంద్రంలోని బజారువీధిలో వెలసిన శ్రీఅభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు బుధవారం రాత్రి యాళి వాహనంపై స్వామి వారు భక్తులను అనుగ్రహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవమూర్తులను అర్చకులు రాజశేఖర దీక్షితులు, కుమారస్వామి, మహేష్ ప్రత్యేకంగా అలంకరించి యాళివాహనంపై కొలువు తీర్చారు. వాహనాన్ని ప్రభలతో పాటు ప్రత్యేకంగా పరిమళభరిత పుష్పమాలికలు, విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. అనంతరం మేళతాళాలు, భక్తుల శివనామస్మరణల నడుమ పురవీధుల్లో ఊరేగింపు నయనానందకరంగా జరిగింది. కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

వెంకన్న ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



సుగంధ ద్రవ్యాల మిశ్రమ ఊరేగింపులో అధికారులు, అర్చకులు

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ శ్రీదేవి,భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. గర్భాలయాలను శుద్ధి చేసి గోడలను సుగంధ ద్రవ్యాలతో లేపనం చేశారు. ఈ నెల 21 నుంచి 29 వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరిచి నిత్య పూజలు, కై ంకర్యాలు చేశారు. వివిధ రకాల సుగంధ ద్రవ్యాలు, తిరుచూర్ణంతో కలిసిన మిశ్ర మాలను మేళతాళాలతో ఆలయ అంతర ప్రాకారంలో పరిచారకులు ఊరేగించారు. అ నంతరం వెంకన్న ఆలయంతో పాటు పద్మావతీ అమ్మవారు, గోదాదేవి గర్భాలయాల గోడలకు లేపనం చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు గంట నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. టీటీడీ స్థానిక ఆలయాల డిప్యూటీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, అర్చకులు శ్రీధరభట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిలు చెల్లించండి

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండలం కల్లూరు విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో బకాయిలు ఉన్న వారు వెంటనే చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని ట్రాన్స్‌కో ఏఈ పురుషోత్తం బుధవారం కోరారు. వ్యవసాయ, గృహాలకు సంబంధించి బకాయిలు ఉన్నవారు జాప్యం చేయకుండా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

దాడి ఘటనపై ఫిర్యాదు

రామకుప్పం: మండలంలోని ననియాలకు చెందిన తనపై అదే గ్రామానికి చెందిన గజేంద్ర, చరణ్ సాయి, జగదీష్ బెదిరింపులకు పాల్పడి దాడి చేసినట్లు బుధవారం బాధితుడు బద్యానాయక్ రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సోమవారం సతీష్‌కు చెందిన ఆటోలో వృద్ధులను పోలింగ్ కేంద్రానికి తరలిస్తుండగా గజేంద్ర, చరణ్‌సాయి, జగదీష్ అడ్డుకుని తనను కులం పేరుతో దూషించి దౌర్జన్యానికి పాల్పడినట్లు, అదేవిధంగా రాత్రి ఏడు గంటల సమయంలో పోలింగ్ కేంద్రం సమీపంలో దాడి చేసారని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

పెట్రేగుతున్న కేబుల్ చోరీ దొంగలు

పలమనేరు: మండలంలోని అటవీ సమీప గ్రామాల్లో వ్యవసాయ బోరు మోటార్ల కేబుల్ దొంగలు పెట్రేగుతున్నారు. మూడునెలలుగా వరుస చోరీలు జరుగుతున్నాయి. తాజాగా పెంగరగుంట పంచాయతీలో ఏటిగడ్డిండ్లు, ముసలి మొడుగు, కృష్ణాపురం తదితర గ్రామాల్లో పలువురి రైతుల వ్యవసాయ బోర్ల వద్ద రూ.వేల విలువైన మోటార్ కేబుళ్లు చోరీ అయ్యాయి. దీనిపై బాధిత రైతులు స్థానిక పోలీసులకు ఇప్పటికే ఫిర్యాదులు చేశారు. మదనపల్లె ప్రాంతానికి చెందిన ఓ ముఠా ముసలి మొడుగు సమీపంలో ఉంటూ ఈ చోరీలకు పాల్పడుతున్నట్టు ఇప్పటికే పోలీసులు గుర్తించారు. వీరు పట్టుబడితే ఈ ప్రాంతంలో ఇప్పటి వరకు జరిగిన చోరీల కేసులో పురోగతి లభిస్తుంది. ఈ విషయమై స్థానిక సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్నామని, కేబుల్ చోరీలకు పాల్పడే వారిని రెండు,మూడు రోజుల్లో కచ్చితంగా పట్టుకుంటామని తెలిపారు. గిజరీ దుకాణాలపై పోలీసు నిఘా ఉందని పేర్కొన్నారు.

గంగ జాతరకు చాటింపు

బంగారుపాళెం: మండల కేంద్రంలో గంగమ్మ జాతరకు మంగళవారం రాత్రి చాటింపు వేశారు. ఈ నెల 28, 29 తేదీల్లో రెండు రోజుల పాటు గంగమ్మ జాతర నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గంగజాతరను ఎన్నికల కోడ్ నిబంధనల మేరకు నిర్వహించనున్నట్లు చెప్పారు.

డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

పుంగనూరు: పట్టణంలోని శుభారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వై.రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీకాం, బీఎస్సీ, బీఏ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మ నిమజ్జనం

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరులో గంగమ్మ తల్లి జాతరను మంగళ, బుధవారాల్లో వేడుకగా జరుపుకున్నారు. సత్యమ్మ తల్లికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. రాత్రి గంగమ్మను ప్రతిష్టాపన చేసి పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.బుధవారం ఉట్లోత్సవం కోలాహలంగా జరిగింది. యువకులు కేరింతలు కొట్టారు. అనంతరం అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొచ్చి నిమజ్జనం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా జనం రావడంతో సందడి నెలకొంది.

తాటిముంజెలతో ఉపశమనం

- వేసవిలో మాత్రమే అందుబాటులో
- ఆరోగ్యానికి ఎంతో మేలు
- రోడ్డు పక్కన విక్రయాలు
- పలువురికి జీవనోపాధి



ఐరాలలో తాటిముంజెల విక్రయం

ఐరాల: తాటి చెట్టులోని అన్ని భాగాలు మనకు ఎన్నో రకాలుగా ఉపయోగపడుతున్నాయి. తాటి బోదెను కలపగాను, ఆకులు ఇళ్లపైకప్పుగాను, విసనకర్రలుగానూ, తాటిముంజెలు, తాండ్ర, బెల్లం, కల్లు ఇలా ప్రతిదీ ఉపయోగపడేదే. తాటి చెట్టు నుంచి లభించే తాటికాయలకు వేసవిలో మంచి డిమాండ్ ఉంటుంది. ఆ కాయల్లో తాటి ముంజెలు లభిస్తాయి. వేసవి ఎండల తీవ్రత నుంచి ఉపశమనానికి మానవాళికి ప్రకృతి ప్రసాదించిన వరం ఈ తాటి ముంజెలు. వేసవిలో ముంజెలు తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుంది. వేసవి సీజన్‌లో మాత్రమే దొరికే వీటిని విక్రయిస్తూ ఎంతోమంది జీవనోపాధి పొందుతున్నారు. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు మాత్రమే దొరికే ఈ తాటిముంజెలు ప్రస్తుతం గ్రామీణ, పట్టణ ప్రాంతాలతో నిమిత్తం లేకుండా దారిపొడువునా లభిస్తున్నాయి. తాటిముంజెలు అమ్మకం కోసం రోడ్డు పక్కన పెట్టిన గంటల వ్యవధిలోనే అమ్ముడుపోతున్నాయి.

రోడ్డు పక్కన విక్రయాలు

తాటిముంజెలు ఎప్పుడంటే అప్పుడు దొరికేవి కావు. వేసవి కాలంలోనే ఇవి కాస్తాయి. ప్రస్తుతం వాటిని మండల కేంద్రంలోని పలు ప్రధాన ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. మండల కేంద్రంలోని బజారు వీధి, వారపు సంత, జెండామాను వీధి, వీఎస్.అగ్రహారంలో జోరుగా విక్రయాలు జరుగుతున్నాయి. మండలంలోని చెంగనపల్లెకు చెందిన పలువురు యువకులు రోడ్డు పక్కన తాటిముంజెలు విక్రయిస్తారు. మరి కొంతమంది యువకులు చిత్తూరు, పీలేరు, పాకాల, తిరుపతిలో ప్రధాన కూడళ్లలో వీటిని అమ్ముతున్నారు. మండలంలో విక్రయదారులు డజను తాటిముంజెలను రూ.70 నుంచి రూ.80 వరకు విక్రయిస్తున్నారు. ప్రతి రోజు సుమారు 50 నుంచి 70 డజన్లు అమ్ముతున్నట్లు వారు చెబుతున్నారు. తాటిముంజెలను గంపల్లో తెచ్చి తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. అందుకే తాటికాయలను అప్పటికి అప్పుడే కొట్టి విక్రయిస్తుండడంతో కొంచెం ధర ఎక్కువగా తీసుకుంటున్నారు.

అనేక పోషకాలు

వేసవి తీవ్రత కారణంగా మన శరీరంలో పోయే అనేక పోషకాలను కొబ్బరి నీరుతోపాటు తాటిముంజెలు తిరిగి అందిస్తాయని వైద్యులు చెబుతున్నారు. వంద గ్రాముల తాటిముంజెలో 92.5 గ్రాముల తేమ, 9.4 గ్రాముల కార్బోహైడ్రేటులు, 9.6 గ్రాముల ప్రోటీన్లు, 0.2 గ్రాముల పీచు పదార్థాలు, 0.1 గ్రాము కొవ్వు, 61 మి.గ్రా ఆమ్లం, 12 మి.గ్రా కాల్షియం, 21 మి.గ్రా ఫాస్ఫరస్, 0.3 మి.గ్రా ఇనుప దాతువు ఉంటాయి. వీటిని తీసుకోవడం వలన వేసవి తాపం తీరడంతో పాటు శరీరానికి అవసరమైన కేలరీలు లభిస్తాయి. అంతేకాక వీటిని ముఖానికి ఫేస్‌ప్యాక్‌గా కూడా ఉపయోగిస్తుంటారు. ఈ విధంగా చేస్తే ముఖంలో అలసట పోతుంది. మొటిమలు, నల్ల మచ్చలు కూడా తగ్గుతాయని చెబుతారు.